www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 మే 2024
8 పేజీలు



ఏలూరు



పశ్చిమ గోదావరి

ష్.. గప్‌చుప్..!



ముగిసిన ఎన్నికల ప్రచారం

పట్టపగలే యథేచ్ఛగా డబ్బు పంపిణీ

ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు అందజేత

రేపు పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామన్న అధికారులు

రెండు జిల్లాల్లో దాదాపు 30 లక్షల మంది ఓటర్లు

సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం ఆరు గంటలతో ముగిసింది. దీంతో పార్టీల అభ్యర్థులంతా ఊపిరి పీల్చుకున్నారు. మార్చి 16న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా దాదాపు 56 రోజులపాటు ఆయా పార్టీల నాయకులు ఉధృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో నువ్వానేనా అన్నట్లు పోటీ మరీ ఇంటింటికీ తిరిగారు. ఎన్నికలకు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలనే నిబంధన అమలులోకి రావడంతో శనివారం సాయంత్రం ప్రచారం ముగిసింది. మైక్‌లు ఆగిపోవడంతో ఒక్కసారిగా ప్రశాంత వాతావరణం నెలకొంది. ఎన్నికల ప్రచారం ముగియడంతో చివరి ఘట్టమైన నోటుకు ఓటు కొనుగోలుకు నాయకులు సిద్ధమయ్యారు. గడిచిన రెండు, మూడు రోజులుగా డబ్బు పంపిణీ పట్టపగలే యథేచ్ఛగా జిల్లాలో కొనసాగుతుండగా, ఈ రెండు రోజులు మరింత ఉధృతంగా డబ్బు పంపిణీకి నాయకులు ప్రణాళికలు రచించారు. భీమవరం, ఉంగుటూరు నియోజకవర్గాల్లో ఓటుకు ఇరుపార్టీలు రూ.రెండు వేలు పంపిణీ చేస్తున్నాయి. నరసాపురంలో అధికార పార్టీ రూ.1500, ప్రధాన ప్రతిపక్ష పార్టీ రూ.వెయ్యి పంచుతున్నట్లు తెలిసింది. ఆచంటలో అధికార పార్టీ రూ.రెండు వేలు, ప్రధాన ప్రతిపక్ష పార్టీ రూ.వెయ్యి ఇస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. నూజివీడు, ఏలూరు వంటి చోట్ల ఓటుకు ఇరుపార్టీలు రూ.వెయ్యి చొప్పున ఇస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లోనూ తక్కువ అనుకుంటే ఓటుకు రూ.వెయ్యి, పలు నియోజకవర్గాల్లో రూ.రెండు వేలు వరకూ పంచుతున్న పరిస్థితి నెలకొంది. ఇవికాకుండా డ్వాక్రా గ్రూపులకు ప్రత్యేకంగా గ్రూపునకు ..6లో



ఏలూరులో సిపిఐ, కాంగ్రెస్ ఎంఎల్ఎ, ఎంపీ అభ్యర్థుల ప్రచారం



భీమవరం మండలంలో కాంగ్రెస్ ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థుల ప్రచారం

బిజెపిపై జగన్ మౌనం

బిజెపి అభ్యర్థి పోటీలో ఉన్నా నోరు మెదపని పరిస్థితి

కొల్లేరు సమస్యను పరిష్కరిస్తామని పాతపాటే

సర్వే నివేదిక ఆధారంగా అదనపు భూములు పంచుతామని ప్రకటన

డిఎన్ఆర్, సునీల్‌కుమార్‌కు ఓటేయాలని అభ్యర్థన

ప్రసంగమంతా సంక్షేమ పథకాల చుట్టూనే

కైకలూరు సభలో సిఎం జగన్



కైకలూరు సభలో మాట్లాడుతున్న సిఎం జగన్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, కైకలూరు

'అక్కడ బిజెపి అభ్యర్థి బరిలో ఉన్నారు.. కేంద్రంలోని మోడీ సర్కార్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసింది. 2014 ఎన్నికల్లో ఇక్కడ అదే బిజెపి అభ్యర్థి గెలిచినా కొల్లేరు ప్రజలకు న్యాయం జరగలేదని అందరికీ తెలిసిందే'.. అయినప్పటికీ కైకలూరు ఎన్నికల సభలో సిఎం జగన్ బిజెపిపై ఒక్క విమర్శ కూడా చేయకుండా మౌనం వహించి, చంద్రబాబుపై విమర్శలు చేసి సరిపెట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిఎం జగన్ శనివారం కైకలూరులో పర్యటించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సిఎం వస్తారని షెడ్యూల్ ఇచ్చినప్పటికీ ఆయన వచ్చేసరికి రెండు గంటలు దాటింది. సభకు తరలించిన జనం మండుటెండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హెలీప్యాడ్ నుంచి నేరుగా సభాస్థలికి చేరుకుని ఎంఎల్ఎ, ఎంపీ అభ్యర్థులతో మాట్లాడించకుండానే నేరుగా ఆయన అరగంటసేపు మాట్లాడి ముగించేశారు. అనంతరం తిరిగి హెలికాప్టర్‌లో పిఠాపురం బయల్దేరి వెళ్లారు. బహిరంగ సభలో సిఎం జగన్ మాట్లాడుతూ చంద్రబాబు మోసాలను నమ్మొద్దన్నారు. 2014 మేనిఫెస్టోలో ఇచ్చిన ఏఒక్క హామీనీ చంద్రబాబు నెరవేర్చలేదని తెలిపారు. మళ్లీ సాధ్యంకాని హామీలను మేనిఫెస్టోలో పెట్టారని విమర్శించారు. జనం ఆలోచించి ఓటేయాలన్నారు. చంద్రబాబుకు ఓటేస్తే పథకాలన్నీ ఆగిపోతాయని, జగన్‌కు ఓటేస్తే పథకాలు ముందుకు సాగుతాయన్నారు. ఐదేళ్లకాలంలో అమలైన సంక్షేమ పథకాలనే పదేపదే తన ప్రసంగంలో ప్రస్తావించారు. 2014 ఎన్నికల్లోనూ పొత్తులో భాగంగా బిజెపి అభ్యర్థిగా ప్రస్తుత అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌నే పోటీ చేసి గెలిచారు. టిడిపి ప్రభుత్వంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా పని చేశారు. అయితే ఐదేళ్లలో కొల్లేరు సమస్యను పరిష్కరించకుండా అక్కడి ప్రజలకు అన్యాయం చేశారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని 2014 ఎన్నికల సందర్భంగా భీమవరంలో జరిగిన సభలో అప్పట్లో ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ హామీ సైతం ఇచ్చారు. సమస్యను మాత్రం పరిష్కరించలేదు. అంతేకాకుండా ప్రత్యేక హోదా, రైల్వేజోన్, ..6లో

14 కోర్టు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన



కోర్టు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన న్యాయమూర్తులు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పాత సివిల్ కోర్టు ప్రాంగణంలో నూతనంగా రూ.80.60 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 14 కోర్టుల భవనాల సముదాయ నిర్మాణానికి హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్, హైకోర్టు జడ్జి జస్టిస్ ఎవి.శేషసాయి శనివారం శంకుస్థాపన చేశారు. తొలుత జడ్జీలు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ ఎవి.శేషసాయి, జస్టిస్ నినల జైసూర్య, జస్టిస్ సుబ్బారెడ్డి సత్తిలకు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పురుషోత్తమ్‌కుమార్, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు మోగళ్ల వెంకట రమణారావు, కార్యదర్శి పాకాల రమేష్‌బాబు, అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆనంద ఫంక్షన్ హాల్లో జస్టిస్ ఆకుల వెంకటసాయిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమవరం మూడో అదనపు కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి డి.సత్యవతి, సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జీలను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

భీమవరంలో కోర్టు భవనాల నిర్మాణానికి శంకుస్థాపనకు భీమవరం విచ్చేసిన హైకోర్టు జడ్జీలు బి.కృష్ణమోహన్, ఆకుల వెంకట శేషసాయి, నినల జై సూర్య, సుబ్బారెడ్డి సత్తిలను శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

అత్యంత అప్రమత్తంగా ఉండండి

మధ్యపేజీల్లో..

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు

8లో..

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

8లో..

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు సిద్ధం

ఏలూరు జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు



ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులందరూ సంసిద్ధంగా ఉండాలని, ఆ దిశగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఏలూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న సూచించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం రాత్రి రిటర్నింగ్ అధికారులు తదితరులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల వసతులూ ..6లో

పోలింగ్‌కు సర్వం సిద్ధం

పశ్చిమగోదావరి జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం



జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధంగా ఉన్నట్లు పశ్చిమగోదావరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో హింసకు తావులేని, రీ పోలింగ్‌నకు అవకాశం ఇవ్వని ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఎలాంటి ప్రలోభాలకూ ..6లో

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి

ఏలూరు అర్బన్:ఎన్నికల సామగ్రి పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక కోటదిబ్బపై ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లు ఆయన పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 213 పోలింగ్ కేంద్రాలను 22 సెక్టార్లుగా విభజించి, వారందరికీ ఎన్నికల సామగ్రి పంపిణీ చేసేందుకు 22 వరుసలలో టేబుల్స్ ఏర్పాటు చేయటం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రానికి కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్, కంపార్ట్మెంట్లతో పాటు ఇతర సామగ్రి కలుపుకుని మొత్తం 50 రకాల సామగ్రిని పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు రాజకీయ పార్టీల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ తెరిచి బ్యాలెట్ బాక్సులు, వివి ప్యాట్లు ఓపెన్ చేసి సిబ్బందికి అందించడం జరుగుతుందన్నారు. సిబ్బందికి ఉదయం అల్పాహారం, కాఫీ, టీ, మజ్జిగ ఏర్పాటు చేయడం జరుగుతుందని, మధ్యాహ్న భోజనం కూడా పంపిణీ కేంద్రం వద్దే ఏర్పాటు చేయడం జరిగిందని, అనంతరం సామగ్రితో వారి వారి పోలింగ్ కేంద్రాలకు చేరుకునేందుకు మొత్తం 130 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు చివరి పోలింగ్ స్టేషన్కు బస్సుల్లో చేరుకోవాలని సూచించారు. సోమవారం సాయంత్రం పోలింగ్ అనంతరం తిరిగి బస్సుల ద్వారా సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్దకు చేరుకుని, అక్కడ ఎన్నికల సామగ్రి అప్పగించాల్సి ఉంటుందని, వారికి రాత్రి భోజనం అక్కడే ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సామగ్రి పంపిణీలో ఎలాంటి అవకతవకలకు అవకాశాలు లేకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రామ్ విద్యాసాగర్, ఏలూరు మున్సిపల్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యాన పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మానవతా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని, అందులో భాగంగా ఈరోజు పౌష్టికాహారం, మజ్జిగ ప్యాకెట్లు అందజేయడం జరిగిందని మానవత జిల్లా విద్యానిధి ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రాష్ట్రీయ బాల సురక్ష కేంద్రం సెంటర్లో శనివారం మానవత జిల్లా విద్యానిధి ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు సౌజన్యంతో 30 మందికి, నందిగం దివ్యశ్రీ, అపూర్వల సౌజన్యంతో ఐదుగురు హెచ్ఐవి సోకిన బాలబాలికలకు నెలకు సరిపడా పౌష్టికాహారాన్ని, మజ్జిగ ప్యాకెట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు మేతర అజయ్ బాబు, రీజియన్ ఛైర్మన్ పోలవరపు దేవరత్నాకరరావు, మానవత డైరెక్టర్ కడియాల కృష్ణారావు పాల్గొన్నారు.

అత్యవసర వీల్చైర్లు కొనుగోలు

రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వికలాంగులు, వయోవృద్ధులు పోలింగ్ బూత్లో ఓటు వేయుటకు, ప్రభుత్వ ఆసుపత్రులలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, కలెక్టరేట్, న్యాయస్థానములలో ప్రజలు ఉపయోగార్థం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ అత్యవసరమైన 100 వీల్ చైర్లు కొనుగోలు చేసిందని జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాటి ధర ఒక్కొక్కటి రూ.5000 వేలకి కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దాతలను భాగస్వాములను చేసేందుకు రెడ్క్రాస్ సొసైటీ నిర్ణయం తీసుకుందని, కావున ఎవరైనా దాతలు స్పందించి రూ.5 వేలు రెడ్క్రాస్ గూగుల్ పే నెంబర్ 9494093838 ద్వారా గాని నేరుగా చెక్కు రూపంలో గాని ఇచ్చినచో వారి పేరు వీల్ ఛైర్పై రాయటంతో పాటు వారికి రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యత్వం ఇస్తామని అన్నారు. వివరాలకు జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయ సిబ్బందిని సంప్రదించవచ్చునని తెలిపారు.

ప్రచారానికి తెర

ప్రజాశక్తి - ముసునూరు

నూజివీడు నియోజకవర్గంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రచారానికి శనివారం సాయంత్రం ఐదు గంటలతో తెరపడింది. స్థానిక ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పట్టణంలోని ఐదవ వార్డు పరిధిలో ఉన్న బొందిలిపేటలోని గంగానమ్మ దేవాలయం వద్ద సాయంత్రం ఐదు గంటలకు ప్రచారాన్ని ముగించారు. ఎన్డిఏ ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి తన ఎన్నికల ప్రచారాన్ని మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సాయంత్రం నాలుగు గంటలకు ముగించారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి - తణుకు

నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించినట్లు కాంగ్రెస్ అభ్యర్థి కడలి రామారావు తెలిపారు. శనివారం తణుకు పట్టణం, ఇరగవరం, అత్తిలి మండలంలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి కెవిస్ గట్టు గ్రామంలో ప్రచారం ముగించినట్లు తెలిపారు. ఇరగవరం మండలం కొత్తపాడు, కాకిలేరు, కంతేరు, అత్తిలి మండలం ఉనికిలి, మంచిలి గ్రామంలో ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించినట్లు వివరించారు. గ్రామాల్లో ఏ ఊరికి వెళ్లినా ఓటర్ల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ముఖ్యంగా రైతుల నుంచి ఆదరణ బాగుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేస్తామని తెలిపారు. సిపిఎం, సిపిఐలకు పూర్తి మద్దతుగా నిలిచి ప్రచారంలో తనకు సహాయ సహకారాలు అందించారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఇండియా వేదిక నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీకి సర్వం సిద్ధం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈనెల 12న నారాయణపురం జెడ్పి ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ఏర్పాట్లను ఉంగుటూరు రిటర్నింగు అధికారి ఎస్ఎస్కె.ఖాజావలీ శనివారం పర్యవేక్షించారు. 214 పోలింగు కేంద్రాలకు గానూ 25 సెక్టోరోల్ అధికారులకు బాధ్యతలను అప్పగించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ సునాయాసంగా పంపిణీ చేసేందుకు సరిపడా టేబుల్స్, స్టాల్స్, కుర్చీలు అమర్చిన ఏర్పాట్లను దగ్గరుండి ఆయన పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు కూలర్లు బిగించారు. సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.



నారాయణపురంలో డిస్ట్రిబ్యూషన్ సెంటరులో స్టాల్స్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్ఒ ఖాజావలీ

ముగిసిన ప్రచారం.. ప్రలోభాలకు శ్రీకారం

ప్రజాశక్తి - కైకలూరు

ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలక ఘట్టమైన ప్రచార పర్వానికి తెరదించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు మైకులు మూగబోయాయి. పలు రాజకీయ పార్టీలు 40 రోజులుగా చేస్తున్న ప్రచారం నిశ్శబ్దమైంది. చివరి రోజు వైసిపి అధినేత సిఎం జగన్మోహన్ రెడ్డి కైకలూరులో ఎన్నికల ప్రచారంతో వైసిపి చివరి ప్రచారం ముగిసింది. ఎన్డిఏ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ కలిదిండి మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. చివరగా కైకలూరులోని ఎన్డిఏ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ల్యాండ్ టైటిలింగ్ చట్టానికి సంబంధించిన కరపత్రాలను చించి వేశారు. ఆ పార్టీకి చెందిన పలువురు ప్రముఖ నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్, సినీ నటులు విక్టరీ వెంకటేష్, పలువురు దర్శకనిర్మాతలు కామినేని శ్రీనివాస్ విజయం కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపిలో ఎంఎల్ఎ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ప్రచారం చేశారు. ఇండియా వేదిక అభ్యర్థి బొడ్డు నోబుల్ చివరి రోజు జ్వరంతో బాధపడుతూ తాను నివాసం ఉంటున్న ఎన్జిఒ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, మైనార్టీ సెల్ నాయకులు జోషఫ్, సిపిఎం నాయకులు డిఎన్విడి ప్రసాద్, మహంకాళి రావులు ఆయనకు తోడుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు స్వతంత్ర అభ్యర్థులు వారి వారి శైలిలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రచారం ముగిసిన అనంతరం నాయకులు ప్రలోభాల పర్వానికి తెరలేపారు. ఓటర్లను ప్రసన్నం చేసేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన పార్టీలు వైసిపి, ఎన్డిఏ పార్టీలు ఓటర్లకు రూ.2 వేలు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు

డిఎస్పి సురేష్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - పోలవరం

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్పి సురేష్ కుమార్ రెడ్డి సూచించారు. శనివారం పోలవరంలో స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందని, నియోజకవర్గంలో 50 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 300 మంది పోలీస్ బలగాలు, 180 మంది ప్రత్యేక పోలీస్ బలగాలు బందోబస్తు కోసం పనిచేయనున్నాయన్నారు. రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రచార కార్యక్రమాలు శనివారం సాయంత్రం 6 గంటలతో ముగిసాయని తెలిపారు. నియోజకవర్గంలో ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు నిర్వహించినా మద్యం, డబ్బు పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టడం, భయ భ్రాంతులకు గురి చేయడం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ప్రవర్తిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని, రాజ్యాంగం ఇచ్చిన హక్కుని కాపాడుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో కొయిదా సమీపంలో కాకిశనూడు, వేట్లపాలెం, పేరంటాలపల్లి గ్రామాల ఇతర ఓటర్లకు రవాణా సౌకర్యం లేదని గోదావరిపై పడవల సహాయంతో వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవలసి ఉంటుందన్నారు. నెట్వర్క్లు పనిచేయని, ఆ ప్రాంతాల్లో శాటిలైట్ ఫోన్లు వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డిఎస్పి సురేష్కుమార్ రెడ్డి

ముగిసిన ప్రచారం.. నగదు పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలం వ్యాప్తంగా శనివారం సాయంత్రానికి ఎన్నికల ప్రచారం ముగియడంతో వివిధ పార్టీల నాయకులు ఓటర్లను తమ వైపుకి తిప్పుకునేందుకు ఓటుకి నోటు ఇచ్చే కార్యక్రమంలో మునిగిపోయారు. టిడిపి కూటమి, వైసిపి నాయకులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ ఓటుకి రూ.వెయ్యి చొప్పున ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో నాయకులు నగదు పంపిణీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.



ఆళ్లనాని సమక్షంలో చేరుతున్న యువత

వైసిపిలోకి పలువురు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎన్నికల సంగ్రామం చివరి దశకు చేరుకుంటున్న తరుణంలో ఏలూరు నియోజకవర్గంలోని వైసిపిలో చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. దౌర్జన్యాలు, అక్రమాలు, భూకబ్జాలు, అరాచకాలు లేకుండా ఆళ్ల నాని నాయకత్వంలో ఏలూరు నగరం ప్రశాంతంగా ఉందని, మళ్లీ ఆయనే రావాలంటూ టిడిపి, జనసేన పార్టీలకు చెందిన సుమారు 200 మంది శనివారం వైసిపిలో చేరారు. శ్రీరామ్ నగర్ లోని క్యాంప్ కార్యాలయానికి తీన్మార్ డప్పులతో ఊరేగింపుగా వచ్చి బాణాసంచా కాల్చి ఎంఎల్ఎ ఆళ్ల నాని సమక్షంలో వైసిపి కండువా కప్పుకున్నారు. పిల్లా దేవేంద్ర నాయుడు, పేరాబత్తుల జయదీప్ నాయుడు, పల్లంట్ల బాలు నాయుడు ఆధ్వర్యంలో చేరిన 200 మందికి ఎంఎల్ఎ ఆళ్ల నాని పార్టీ కండువాలు కప్పి వైసిపిలోకి సాదరంగా ఆహ్వానించారు. ఏలూరు నగర ప్రజల ప్రశాంతమైన జీవనానికి, వారి సంక్షేమానికి కృషి చేస్తానని, ప్రజలకు అండగా ఉంటానని ఎంఎల్ఎ తెలిపారు.

సిఎం సభకు తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

కైకలూరు సిఎం జగన్ సభకు శనివారం ముదినేపల్లి మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆటోలు, బస్సులు, కార్లు, ట్రాక్టర్లపై భారీగా జనాన్ని వైసిపి నాయకులు కైకలూరు తరలించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి బైక్ ర్యాలీగా సిఎం జగన్ సభకు మండలం నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు.

CHANGE OF NAME

I, **RAYUDU JHANSI** W/o. Rayudu Ayyappa, D.No. 1-14, Rajugari Thota Village-534280. Narasapuram Mandal, W.G.Dt. A.P., I have changed my name from **VEERAVALLI JHANSI** (Old name) to **RAYUDU JHANSI** (New name). Hence after all my documents and correspondence will be countinue with my New name **RAYUDU JHANSI**

వైసిపిని ఓడించాలి

శిరిగినీడి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - నరసాపురం

మన ఆస్తులకు మనం యజమానులుగా ఉండాలంటే జగన్‌ని ఓడించాలని, మన భూములకు రక్షణ ఉండాలంటే చంద్రబాబును గెలిపించాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, తెలుగు మహిళా పశ్చిమ గోదావరి జిల్లా మాజీ అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి సూచించారు. రాజ్యలక్ష్మి నివాసంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు నిరసనగా ఆ పత్రాలను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ల్యాండ్, శాండ్, వైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యం కొల్లగొట్టడం ద్వారా రూ.ఎనిమిది లక్షల కోట్లు స్వాహా చేశారని, వీటికి సివిల్ కోర్టులు అడ్డంకిగా ఉన్నాయని కోర్టుల రక్షణను తొలగించడానికే రెవెన్యూ అధికారులకు కోర్టు అధికారాల్ని కట్టబెడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం తెచ్చారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే రెండో సంతకంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై చేస్తారన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో అధోగతి పాలైందన్నారు. టిడిపి కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టిడిపి కూటమికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కమిటీ కార్యదర్శి అలవల తాయారు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చల్లా పద్మావతి, షేక్ యూనిస్ బేగం, సుంకర రాజకుమారి, మాధవి, ఫాతిమా, రజియా, దేవి పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మాజీ ఎంఎల్‌ఎ ఈలి నాని ఆధ్వర్యంలో శనివారం సుమారు 500 మంది మహిళలు, వంద మంది యువకులు టిడిపి నుంచి వైసిపిలోకి చేరారు. టిడిపి పట్టణ మాజీ అధ్యక్షురాలు తోట సునీత, మాజీ కౌన్సిలర్లు కిలాడి గంగాభవాని, కిలాడి పుష్పకుమారి, ఎం.మాణిక్యం, టిడిపి సీనియర్ నాయకురాలు పాతూరి నాగమణి ఉన్నారు. కొత్తగా పార్టీలోకి చేరిన వారికి వైసిపి తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతిఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం, గౌరవం ఉంటుందన్నారు.

టిడిపి కూటమితో అవినీతి రహిత పాలన

కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అవినీతి రహిత పాలన కావాలంటే టిడిపి కూటమిని గెలిపించాలని కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి కోరారు. తాడేపల్లిగూడెంలోని బొలిశెట్టి నివాసం వద్ద శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసి అవినీతిలో మగ్గిపోయిన ఎంఎల్‌ఎ కొట్టును ఇంటికి పంపాలన్నారు. ప్రజల కోసం తోడుగా ఉన్న బొలిశెట్టి శ్రీనివాస్‌ను గెలిపించుకోవాలన్నారు. బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపి కూటమి విజయం ప్రజల విజయంగా భావించి ఓటర్లంతా ముందుకు వచ్చి స్వచ్ఛందంగా భారీ ఎత్తున ఓట్లు వేయాలని కోరారు. నియోజవర్గ అభివృద్ధి తాను దగ్గరుండి చూసుకుంటానని హామీ ఇచ్చారు. కూటమికి మద్దతు తెలిపిన శ్యామలారాణికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

టిడిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి రోషన్‌కుమార్



ప్రచారంలో రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి చంద్రబాబు పాలన చేస్తారని, చంద్రబాబు సిఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టిడిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలంలో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు వేసి టిడిపి కూటమిని గెలిపించాలన్నారు. ఓటు వేసే ప్రతి ఒక్కరికీ అభివృద్ధితో సమాధానం చెబుతానన్నారు. జగన్‌వి నియంతృత్వ విధానాలని, వైసిపి నాయకులు కూడా ఆయన విధానాలతో విసిగి వేసారిపోయారన్నారు. పదవులు వదిలేసి భారీ సంఖ్యలో రాష్ట్ర భవిష్యత్తు కోసం వైసిపి నుంచి టిడిపిలో చేరుతున్నారన్నారు. గడచిన ఐదేళ్ల సిఎం జగన్ పాలనలో రాష్ట్రంలోని యువత భవిష్యత్ నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు రాక, యువత ఉపాధి, ఉద్యోగావకాశాలు కోల్పోయారన్నారన్నారు. రాష్ట్రంలో మళ్లీ సాధారణ పరిస్థితులు వచ్చి అభివృద్ధి, సంక్షేమం దిశలో పయనించాలంటే టిడిపి కూటమి ప్రభుత్వం రావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

సిపిఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో సిపిఐ నేతలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. బోయగూడెం నుంచి ప్రారంభమైన ర్యాలీ కోర్ట్ సెంటర్, ఎన్‌విఎన్.కాలనీ, ముస్లిం వీధి, గురుపట్లగూడెం రోడ్డు, పాత చింతలపూడి రత్న అపార్ట్‌మెంట్స్ మెరక వీధి, రామకృష్ణ నగర్, వెంకట్రామ బాగ్ ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి సిపిఐ కార్యాలయం వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, విశాఖ ఉక్కు రక్షించుకోవాలన్నా, రైతులకు రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర ఎంఎస్‌పి కావాలన్నా, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు జరగాలన్నా, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నా, ముస్లిం రిజర్వేషన్లు కాపాడుకోవాలన్నా ఇండియా వేదికను గెలిపించాలన్నారు. ఈ ర్యాలీలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శులు పుల్లూరు సోమశేఖర్, తొర్లపాటి బాబు, మండల కమిటీ సభ్యులు జంగా రామచంద్రారెడ్డి, ఎస్‌కె.జాని, ముల్లగిరి నాగేశ్వరరావు, ఎస్‌కె కాలేషా, దంతా కృష్ణ, ఎస్‌కె.మస్తాన్, తుర్లపాటి రాజు, కొలికి పాము నాగేశ్వరరావు, కొవ్వూరి కృష్ణ, నరసింగ రామారావు, రైతు సంఘం నాయకులు కె.ప్రసాద్, టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభానికి లాంతరు కట్టి నిరసన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ప్రజల కరెంట్ కష్టాలపై ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వెలగని వీధి విద్యుత్ స్తంభానికి శనివారం తెల్లవారుజామున లాంతరు కట్టి జగన్ దురదృష్టవశాత్తు మళ్లీ అధికారంలోకొస్తే భవిష్యత్తులో ఇదే పరిస్థితి ఎదురవుతుందని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి టిడిపి కూటమి అధికారంలోకొచ్చేలా ఓటేయాలని కోరారు. జగన్ మళ్లీ అధికారంలోకొస్తే ప్రజల బతుకులు చీకటిగా మారుతాయన్నారు. ప్రతిరోజూ 10 నుంచి 15 గంటల పాటు విద్యుత్ కోతలతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. ప్రజలకు కరెంట్ కష్టాలు శాశ్వతంగా తొలగాలంటే టిడిపి కూటమి అధికారంలోకి రావాలన్నారు. పాలకొల్లులో గత టిడిపి ప్రభుత్వంలో మంజూరైన 132 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. జగన్ ఐదేళ్ల ప్రభుత్వంలో సబ్‌స్టేషన్ నిర్మాణంపై ఊసే లేదన్నారు.



విద్యుత్ స్తంభానికి లాంతరు కడుతున్న నిమ్మల


ప్రజల ఇష్టం మేరకే పోటీ : శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

ప్రజల ఇష్టం మేరకే ఎన్నికల్లో పోటీకి దిగినట్లు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. ఉండి మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు గతంలో పలుమార్లు సిట్టింగ్ ఎంఎల్‌ఎలకే సీట్లు అని ప్రకటించడంతో తాను ఎంఎల్‌ఎగా ఓడిపోలేదు కాబట్టి తాను కూడా సిట్టింగ్ ఎంఎల్‌ఎనే అనే భావనలోనే సీటును కోరుకున్నానని, కాని అధిష్టానం తనను మోసం చేసి మంతెన రామరాజుకు అభ్యర్థిత్వాన్ని కేటాయించిందన్నారు. దీంతో ప్రజల ఇష్టం మేరకు పోటీలో దిగానని చెప్పారు. తాను వైసిపి మనిషినని కనుమూరి రఘురామకృష్ణంరాజు చెప్పడం హాస్యాస్పదమన్నారు. రఘురామకృష్ణంరాజు మాదిరిగా తాను పార్టీలు మారే వ్యక్తిని కాదని, తనను అధిష్టానం మోసం చేసినందుకే స్వతంత్ర అభ్యర్థిగా పోటీలోకి దిగానన్నారు. కాని తన పేరుతో ఉన్న వ్యక్తులతో నామినేషన్లు వేయించినందునే ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ మ్యాండేట్ తెచ్చుకుని సింహం గుర్తుపై పోటీ చేస్తున్నానన్నారు. ఈ సమావేశంలో కలవపూడి గ్రామ సర్పంచి గేదెల జాన్, ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, ఎన్ఆర్‌పి అగ్రహారం మాజీ సర్పంచి మేడిద ప్రియదర్శిని పాల్గొన్నారు.

ముఖ్య వార్తలు

ఆదివారం 12 మే 2024



ప్రచారంలో కానూరి బుజ్జి

కాంగ్రెస్‌కు అన్ని తరగతుల మద్దతు

నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి బుజ్జి

ప్రజాశక్తి - నరసాపురం

అన్ని తరగతుల మద్దతు కాంగ్రెస్‌కు ఉందని ఆ పార్టీ నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థికానూరి ఉదయ భాస్కర్‌కృష్ణప్రసాద్(బుజ్జి) అన్నారు. మండలంలోని చినమామిడి పల్లి, మల్లవరం, కొప్పర్రు, లిఖితపూడి, సరిపల్లి గ్రామాల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో నరసాపురం నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యమన్నారు. నరసాపురం యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మోకా శ్రీను, వినుకొండ రమేష్, పోతురాజు రాజు, మల్లిపూడి శ్రీను, పోలిశెట్టి బాబ్జి పాల్గొన్నారు.

టిడిపి ఎంపీ, ఎంఎల్‌ఎ అభ్యర్థులను గెలిపించాలని ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌ను, ఎంఎల్‌ఎ అభ్యర్థి బడేటి చంటిని గెలిపించాలని కోరుతూ పులి శ్రీరాములు సారథ్యంలో ఏలూరులో శనివారం మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పవర్‌పేట బడేటి కార్యాలయం వద్ద నుంచి బయలుదేరిన ర్యాలీ గూడ్స్ షెడ్ రోడ్, పాత బస్టాండ్, వసంతమహల్, ఓవర్ బ్రిడ్జి, ఫైర్ స్టేషన్ సెంటర్, ప్రభుత్వాసుపత్రి, ఆర్ఆర్.పేట, జనసేన కార్యాలయం మీదుగా తిరిగి పవర్‌పేట చేరింది. ఈ ర్యాలీలో కాపు సంక్షేమ సేవా సంఘం నాయకులు మోటేపల్లి చంద్రశేఖర్, బడే సతీష్‌నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'టిడిపి కూటమిని గెలిపించాలి'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమిని గెలిపించాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి కోరారు. ఈ మేరకు ఆమె శనివారం మండలంలోని గవరవరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అరాచక పరిపాలన కొనసాగుతుందన్నారు. మంచి పరిపాలన రావాలంటే టిడిపి కూటమిని గెలిపించాలన్నారు. టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌ను, జనసేన పోలవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి చిర్రి బాలరాజును గెలిపించాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి కూటమి అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లపర్తి ఝాన్సీరాణి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలి

టిడిపి ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవాలంటే రాష్ట్రంలో వైసిపి రాక్షస పాలన పోవాలనే ఒక దృఢ నిశ్చయంతో ప్రజలందరినీ చైతన్యవంతం చేయాలని ఎంతో కష్టపడ్డామని టిడిపి ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. స్థానిక పవర్‌పేటలోని టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ నాలుగో తేదీన రానున్నది ప్రజా ప్రభుత్వమని, టిడిపి కూటమి ప్రభుత్వం మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకుని, రాష్ట్ర భవిష్యత్తును, ప్రజల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చి రానున్న రోజుల్లో మన ఆస్తులన్నీ జగన్ తాకట్టు పెట్టి తానే అమ్ముకునే విధంగా చట్టాలను తీసుకొచ్చారన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రతి ఒక్క ఉద్యోగి ఇబ్బంది పడ్డారని, ఆశావర్కర్లు, టీచర్లు, అంగన్వాడీలు, శానిటేషన్ వర్కర్లు, లాయర్లందరూ రోడ్లపైకి వచ్చి ప్రభుత్వంపై ఎదురు తిరిగారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు..

ఏలూరు రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి తెలిపారు. ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న : సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఏర్పాట్లు ఎంతవరకూ వచ్చాయి?

ఆర్ఒ : ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. అలాగే ఆదివారం పోలింగ్ సామగ్రి పంపిణీకి కోటదిబ్బపై ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. సామగ్రి పంపిణీలో లోటుపాట్లు జరగకుండా పూర్తి చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న : నియోజకవర్గ పరిధిలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు? ఎంతమంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు?

ఆర్ఒ : ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 213 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. 2,35,345 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారిలో పురుషులు 1,12,426 మంది, మహిళలు 1,22,872 మంది, ఇతరులు 47 మంది ఉన్నారు.

ప్రశ్న : ఎంతమంది పోలింగ్ సిబ్బంది పాల్గొంటున్నారు?

ఆర్ఒ: మొత్తం 1300 మంది వరకూ సిబ్బంది ఎన్నికల్లో పాల్గొంటారు. మొత్తం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను 22 రూట్లుగా విభజించాం. 22 మంది రూట్ ఆఫీసర్లతో 54 బస్సులు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక కేంద్రాలు ఏమైనా గుర్తించారా?

ఆర్ఒ : 47 కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించాం. శనివారపుపేట, తంగెళ్లమూడి, పోడిదిబ్బ తదితర ప్రాంతాలు ఇందులో ఉన్నాయి. పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : సమస్యాత్మక కేంద్రాల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఆర్ఒ : సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించడం జరుగుతుంది. అలాగే ప్రతి లొకేషన్‌లో ఒక మైక్రో అబ్జర్వర్ పని చేస్తారు. 11 కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం పోలింగ్ కేంద్రాలను, పోలింగ్ జరిగే తీరును పర్యవేక్షిస్తూ ఉంటాయి.

ప్రశ్న : పోలింగ్ సామగ్రి పంపిణీకి ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

ఆర్ఒ : ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ సామగ్రి పంపిణీ జరుగుతుంది. పోలింగ్ సిబ్బందికి ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశాం. పోలింగ్ సామగ్రి పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శనివారం సామగ్రి పంపిణీ చేసే సిబ్బందికి శిక్షణ, తగు సూచనలు ఇచ్చాం.

ప్రశ్న : ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన బ్యాలెట్ బాక్సులు ఇతర సామగ్రి తీసుకుని బస్సుల వద్దకెళ్లేదానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏమైనా చేశారా?

ఆర్ఒ : ఎన్నికల సామగ్రి బస్సుల వద్దకు చేర్చేందుకు 50 మంది హమాలీ వర్కర్లను ఏర్పాటు చేశాం. వారే బ్యాలెట్ బాక్సులు, ఓట్ల పెట్టెలు, ఇతర పోలింగ్ సామగ్రి బస్సుల వద్దకు తీసుకెళ్తారు.

ప్రశ్న: పోలింగ్ రోజు ఎలాంటి నిబంధనలు అమలులో ఉంటాయి?

ఆర్ఒ : ప్రతి పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుంది. 200 మీటర్ల బయట మాత్రమే అభ్యర్థులు తమ బెంచ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. గుంపులు గుంపులుగా ప్రజలు గుమికూడరాదు. శనివారం సాయంత్రం ఐదు గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకూ డ్రై డే అమలు చేయడం జరుగుతుంది.

ప్రశ్న : చివరిగా ఓటర్లకు మీరు ఇచ్చే సలహా ఏంటి?

ఆర్ఒ : ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురికాకుండా ధైర్యంగా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎవరైనా ఆటంకం సృష్టిస్తే వెంటనే ఎన్నికల కమిషన్‌కు గాని, అధికారులకు గాని, స్థానిక పోలీసులకు గాని ఫిర్యాదు చేయాలి. ఓటు హక్కు బాధ్యతగా భావించాలి.

అత్యంత అప్రమత్తంగా ఉండండి


పోలింగ్ సామగ్రి పంపిణీ సమీక్షలో పశ్చిమ ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

సాధారణ ఎన్నికల ప్రక్రియ అత్యంత కీలక దశలో ఉందని, ఈ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి ఈ నెల 12న జరిగే పోలింగు సామగ్రి పంపిణీ, 13న పోలింగ్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు అత్యంత కీలక దశకు చేరుకున్నాయన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, పోలింగు సరళి, వెబ్ కాస్టింగ్‌పై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పోలైన ఓట్లు ప్రగతి, సెక్టార్‌వారీగా పోలింగు కేంద్రాల మ్యాపింగు, పోలింగు అధికారుల లాగిన్, డ్యాష్‌బోర్డు అంశాలపై సమగ్ర అవగాహన కల్పించామన్నారు. వీటిపై ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలన్నారు. ఇక్కడ నుంచి చేపట్టే పర్యవేక్షణ, రిపోర్టింగు తీరు కీలకమన్నారు. సమయపాలన విషయంలో కచ్చితత్వం పాటించాలని, ఆదేశాలు పాటించని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌రూమ్ అధికారులు, డిప్యూటీ తహశీల్దారు ఎం.సన్యాసిరావు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎన్నికల సిబ్బంది, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్



ప్రచారం చేస్తున్న సొంగా విజయ రోషన్

అభివృద్ధి చేసేవారిని గెలిపించండి

చింతలపూడి:అభివృద్ధి చేసేవారిని, సేవ చేసేవారిని గెలిపించండని సొంగా విజయ రోషన్ అన్నారు. శనివారం ఫాతిమాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంగా రోషన్ కుమార్‌ను గెలిపించాలని చింతలు లేని చింతలపూడి కోసం సైకిల్ గుర్తుపై ఓటువేయాలని కోరారు. ఎక్కడ చూసినా సమస్యలు ఉన్నాయని, రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలందరూ ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని, మంచిచేసే నాయకుడుని ఎన్నుకోవాలని అన్నారు. రోషన్ మిషన్ హోప్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసేవారన్నారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేశారని, 2014 నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోషన్‌కు అండగా ఉండి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకట్రావు, మానేపల్లి రాజారావు, పాషా, మహాలక్ష్ముడు పాల్గొన్నారు.

వైసిపి వస్తే మన భూములు గల్లంతే

టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి రాధాకృష్ణ

తణుకురూరల్:రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వస్తే మన భూములన్నీ లాక్కుంటారని టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం సాయంత్రంతో సార్వత్రిక ఎన్నికల ప్రచారం ముగియడంతో తణుకులో టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరపున యువత సంఘీభావం తెలుపుతూ తణుకు ఎన్‌టిఆర్ పార్కు నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ మన ఆస్తులు, భూములు లాక్కునే జగన్ కావాలా.. మన ఆస్తులు భూములు విలువ పెంచే చంద్రబాబు కావాలా తేల్చుకోవాలన్నారు. రైతు సోదరులకు పూర్తిగా అండగా నిలుస్తామని, ధాన్యం ఎక్కడ కావాలంటే అక్కడ అమ్ముకునే సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. రాబోయే కాలంలో తణుకు నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకులో రాధాకృష్ణ బైక్ ర్యాలీ

ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి..

పోలవరం రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ




ప్రజాశక్తి - టి.నరసాపురం

పోలవరం నియోజకవర్గంలో ఈ నెల 13న జరిగే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. పోలవరం నియోజకవర్గంలో 7 మండలాలకు సంబంధించి మొత్తం 2 లక్షల 53 వేల మంది ఓటర్లు ఉండగా వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 284 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద సుమారు 2 వేల మందికిపైగా సిబ్బంది పనిచేస్తారని తెలిపారు. 12వ తేదీ సాయంత్రానికి ఇవిఎంలు వంద వాహనాల్లో సిబ్బంది, పోలీసుల పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుంటారన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్దా ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలూ ఏర్పాటు చేశామన్నారు. ముందుగా స్వాగతం బోర్డులు, బారికేడ్లు, తాగునీటి సరఫరా, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. వృద్ధులు, వికలాంగులకు వీల్‌ఛైర్లు, పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. గర్భిణులు, బాలింతలు సౌకర్యంగా ఓటుహక్కు వినియో గించుకునేలా సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి భోజన ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని, విఆర్ఒలు, ఎంఆర్ఒలు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ సమయం ఉంటుందని, ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల మధ్యలో మాక్ పోలింగ్ ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు ఉదయం 5.30లకు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. నియోజకవర్గంలో 284 పోలింగ్ కేంద్రాల్లో 90 పోలింగ్ కేంద్రాల సమస్యాత్మకంగా గుర్తించామన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలతో ఎన్నికల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 44 మంది మండలస్థాయి అధికారులు, 8 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, 4 సర్వేలైన్ బృందాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడైనా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగిన వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసిందన్నారు. 92 శాతం ఓటింగ్ జరిగే విధంగా కృషి చేస్తానన్నారు. ఓటర్లు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డు చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు సహకరించాలన్నారు.

1115 మంది సిబ్బందిని నియమించాం..

నరసాపురం ఆర్ఒ ఎం.అచ్యుత్ అంబరీష్



ప్రజాశక్తి - నరసాపురం

ఈనెల 13న జరిగే ఎన్నికలకు సంబంధించి అన్ని ఏరాట్లూ పూర్తి చేశామని ఆర్ఒ, ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్ అన్నారు. శనివారం అంబరీష్ ప్రజాశక్తితో మాట్లాడారు. నియోజకవర్గంలో నరసాపురం, మొగల్తూరు, నరసాపురం టౌన్ పరిధిలో 169 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. వాటిలో 22 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మొత్తం 1,70,448 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 84,667 మంది, మహిళలు 85,781 మంది ఉన్నారన్నారు. వారిలో సీనియర్ సిటిజన్స్ 846 మంది, యువ ఓటర్లు 4,376 మంది ఉన్నారన్నారు. మొగల్తూరు, నరసాపురం మండలాల్లో, నరసాపురం టౌన్ 1115 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. నరసాపురం నియోజవర్గంలో ఇంతవరకూ 1,489 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియో గించుకున్నారన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని వృద్ధులు, వికలాంగులు 106 మంది హోమ్ ఓటింగ్ విధానాన్ని ఉపయో గించుకున్నారన్నారు. అత్యధికంగా పట్టణంలోని 22వ వార్డులోని పోలింగ్ బూత్ 36లో 1,488 ఓటర్లు ఉన్నారన్నారు. అత్యల్పంగా మొగల్తూరు కోట వద్ద 105 పోలింగ్ బూత్‌లో 482 ఓటర్లు ఉన్నారన్నారు. మొత్తం 219 ఇవిఎంలు వచ్చాయని తెలిపారు. మొత్తం 16 రూట్లు ఉన్నాయని పోలింగ్ సిబ్బంది, సామగ్రి తరలించేందుకు మొత్తం 52 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఓటరు గుర్తింపు కార్డు లేనివారు ప్రత్యామ్నాయంగా 11 రకాల గుర్తింపు కార్డులు చూపి ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అంబరీష్ అన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి..

ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె ఖాజావలీ



ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని ఉంగుటూరు రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె ఖాజావలీ అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పోలింగ్‌కు సంబంధించి పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న : డిస్ట్రిబ్యూషన్, ఎన్నికల సామగ్రి పంపిణీ, రవాణా సదుపాయాల వివరాలు చెబుతారా?

ఆర్ఒ : నియోజకవర్గంలో 25 మంది సెక్టార్ అధికారులను నియమించాం. వీరిలో ఇద్దరు రిజర్వుడు కాగా మిగతా 23 సెక్టోరల్ అధికారులకు సరాసరి ఒక్కో ఎస్ఒలకు ఏడు నుంచి 13 పోలింగ్ కేంద్రాలు కేటాయించాం. ప్రతి పోలింగ్ కేంద్రంలో పిఒ, ఎపిఒ, ఒపిఒలు ముగ్గురితో కలిపి మొత్తం ఐదుగురు ఉంటారు. ఈ నెల 12వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచే నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సిబ్బందికి డ్యూటీలు కేటాయింపు ఆర్డర్లతోపాటు ఎన్నికల సామగ్రి పంపిణీ డిస్ట్రిబ్యూషన్ ప్రక్రియ ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశాం. అందరికీ భోజన వసతి కల్పించాం. ఎన్నికల సామగ్రిని తరలించేందుకు 50 బస్సులు ఏర్పాటు చేశాం.

ప్రశ్న : నియోజకవర్గంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి? ఎంత మంది ఓటర్లు ఉన్నారు?

ఆర్ఒ : ఉంగుటూరు నియోజకవర్గం పరిధిలోని ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం మండలాలకు సంబంధించి 214 పోలింగ్ కేంద్రాల్లో 2,06,437 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,01,545 మంది పురుషులు, మహిళా ఓటర్లు 104886 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు.

ప్రశ్న : ఓటరు స్లిప్పుల పంపిణీ తీరు ఎలా ఉంది?

ఆర్ఒ : ఎన్నికల సంఘం పంపిన స్లిప్పులను బూత్ లెవెల్ అధికారులు ఇంటింటా పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నాం. ఎక్కడైనా ఒకటీ అరా అందకపోతే పోలింగ్ రోజైనా అందజేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

ప్రశ్న : పోలింగ్ కోసం ఎంత మందిని నియమించారు?

ఆర్ఒ : 214 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరపడానికి 2000 మంది సిబ్బందిని నియమించాం. వారిలో పిఒ, ఎపిఒ, ఒపిఒ, సూక్ష్మ పరిశీలకులు, వెబ్ కెమెరామెన్, పోలీసులు, సిఆర్‌పిఎఫ్ తదితర సిబ్బంది ఉన్నారు.

ప్రశ్న : మండలాల వారీగా ఓటర్ల జాబితా చెబుతారా?

ఆర్ఒ : ఉంగుటూరు మండలంలో 63,966 మంది, భీమడోలులో 52,933 మంది, నిడమర్రులో 37,508 మంది, గణపవరంలో 52,030 ఓటర్లు ఉన్నారు.

ప్రశ్న:ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఏం చర్యలు తీసుకున్నారు?

ఆర్ఒ : ప్రజాస్వామ్యంలో ఓటు వినియోగం అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం. గ్రామా గ్రామాన మా బిఎల్ఒ, విఆర్ఒ, తదితర రెవెన్యూ సిబ్బందితో చైతన్యం కలిగించడం, ఓటరు స్లిప్పులు అందించి, పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడ తదితర సదుపాయాలు కల్పించనున్నాం. యువ ఓటర్లకు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు కల్పించి ఓటు ఎలా వేయాలో స్టిక్కర్లు, బ్యానర్లు ఏర్పాటు చేసి వారందరితో ఓటు వేసేలా చర్యలు తీసుకున్నాం. గత ఎన్నికల కంటే ఓటింగ్ శాతం పెంచడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నాం.

ప్రశ్న : ఓటు వేసేందుకు ఏ ఆధారాలు వెంట తీసుకెళ్లాలి?

ఆర్ఒ : ఓటర్ల జాబితాలో పేరున్న ప్రతి ఓటరూ ఎపిక్ కార్డుతో పాటు ప్రభుత్వం గుర్తించి 12 రకాల కార్డుల్లో ఏదైనా వెంట తీసుకెళ్లి పోలింగ్ అధికారులకు చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

ప్రశ్న : ఇవిఎంలు ఎన్ని వచ్చాయి?

ఆర్ఒ : ర్యాండమైజేషన్ అనంతరం ఇవిఎంలు, సెంట్రల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివిప్యాడ్ తదితర పోలింగ్ సామగ్రి 10 శాతం అదనంగా 256 ఇవిఎంలు వచ్చాయి. వాటిని నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల స్ట్రాంగ్ రూమ్‌లో కట్టుదిట్టమైన భద్రతలో ఉంచాం.

ప్రశ్న : వెబ్ కెమెరాలు ఎన్ని బిగించారు?

ఆర్ఒ : సుమారు 150 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలను బిగించి ఎన్నికలు నిస్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్ని గుర్తించారు?

ఆర్ఒ : సుమారు 29 లోకేషన్స్‌లో 52 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించాం. వీటిలో వెబ్ కెమెరాలు, సూక్ష్మ పరిశీలకులు, సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని నియమించి పారదర్శకంగా ఎన్నికలు జరిపేందుకు సర్వం సిద్ధం చేశాం.

ఎన్నికలకు సర్వం సిద్ధం..

తాడేపల్లిగూడెం రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య



ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశామని తాడేపల్లిగూడెం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కె.చెన్నయ్య తెలిపారు. ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో భద్రత ఏర్పాట్లు ఏ విధంగా చేశారు?

ఆర్ఒ : 2,200 మంది సిబ్బందితో నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. వీరిలో పోలీసు సిబ్బందిని అత్యధికంగా నియమించాం. 63 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాం. సిఆర్‌పిఎఫ్, సిఆర్ఎఫ్, సెంట్రల్ స్పెషల్ ఫోర్స్ వంటి అదనపు బలగాలతో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా అమలు చేశాం.

ప్రశ్న : నియోజకవర్గంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు?

ఆర్ఒ : నియోజకవర్గం మొత్తం మీద 2,14,985 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,04871 మంది, స్త్రీలు 11,0104 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అత్యధికం.

ప్రశ్న : ఓటర్ స్లిప్పుల పంపిణీ ఎంత వరకూ జరిగింది?

ఆర్ఒ: నియోజకవర్గంలో మొత్తం మీద 97.5 శాతం స్లిప్పుల పంపిణీ జరిగింది. తాడేపల్లిగూడెం మండలం, పెంటపాడు మండలాల్లో పూర్తిస్థాయిలో స్లిప్పులు పంపిణీ చేశాం. కొన్ని అడ్రస్‌లు పూర్తిస్థాయిలో లేకపోవడం, డబల్ ఓట్లు ఉన్న వాటిని కొన్నింటిని కనుగొన్నాం.

ప్రశ్న: ఓటు వేసేందుకు ఓటరు కార్డుతో పాటు ఇంకా ఏయే ఆధారాలు కావాల్సి ఉంది?

ఆర్ఒ: ఓటర్ ఫొటో గుర్తింపు కార్డుతోపాటు మొత్తం 12 రకాల కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణిస్తాం.

ప్రశ్న: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు మొత్తం ఎన్ని ఏర్పాటు చేశారు?

ఆర్ఒ: మొత్తం 250 ఇవిఎంలను కేటాయించాం.

ప్రశ్న : వెబ్ కెమెరాలను ఎన్నింటిని ఏర్పాటు చేశారు?

ఆర్ఒ : 209 పోలింగ్ కేంద్రాలకు గాను 209 వెబ్ కెమెరాలను ఏర్పాటు చేశాం. కెమెరాల వినియోగం కోసం ట్రెయినింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చాం. వారితోపాటు పిఒ, ఎపిఒ, ఒపిఒలు నలుగురు, బిఎల్ఒలు ఇద్దరు, రిజర్వ్ పోలీసులు ఒక్కో కేంద్రానికి కేటాయించాం.

187 కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు..

ఆచంట రిటర్నింగ్ అధికారి స్వామి నాయుడు



ప్రజాశక్తి - ఆచంట

ఈనెల 13న జరిగే సాధారణ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన తదితర అంశాలపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు.

187 కేంద్రాల్లో పోలింగ్..

నియోజకవర్గం వ్యాప్తంగా నాలుగు మండలాల్లో 187 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అన్ని కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాం, వృద్ధులు వికలాంగులకు ఇబ్బందుల్లేకుండా ర్యాంపులు ఏర్పాటు చేశాం. పలు కేంద్రాల్లో చక్రాల కుర్చీలు అందుబాటులో ఉంచాం.

లంక గ్రామాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాలు..

ఆచంట మండలంలో లంక గ్రామాలు ఉన్నాయి. లంక గ్రామాలు గోదావరి మధ్యలో ఉన్నాయి. అయోధ్యలంకలో రెండు, పుచ్చలంక, ఆనగారలంకలో ఒక్కో పోలింగ్ కేంద్రం ఉంది. పోలింగ్ పూర్తయిన తర్వాత ఇవిఎంలను నేరుగా తూర్పుగోదావరి నుంచి భీమవరం సీత పాలిటెక్నికల్ కళాశాలకు పోలీసు బలగాలతో తరలిస్తున్నాం.

ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తాం. పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ కొనసాగుతుంది. కోడేరు గ్రామ పంచాయతీ పరిధి పల్లిపాలేనికి చెందిన సుమారు 343 మంది ఓటర్లు పడవ దాటి కోడేరు ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వినియోగించాల్సి ఉంది. సాయంత్ర సమయంలో వెలుతురు నిమిత్తం సుమారు 800 నుంచి వెయ్యి మంది వరకూ ఉన్న కేంద్రాల వద్ద ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ బూత్ వద్దా విద్యుత్‌కు అంతరాయం కలగకుండా ఒక లైన్‌మెన్‌ను ఏర్పాటు చేశాం. పోలింగ్ ముందురోజు, పోలింగ్ రోజు స్ట్రాంగ్ రూమ్ వద్ద సిబ్బంది భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశాం. పోలింగ్ అనంతరం బ్యాలెట్ యూనిట్‌ను భీమవరం సీతా పాలిటెక్నికల్ కాలేజీ ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములకు తరలించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశాం. మొత్తం 2,500 మంది పోలింగ్ సిబ్బంది పని చేయనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు మౌలిక సదుపాయాలు కల్పించాం. పోలింగ్ రోజున ఇవిఎంలు, వివి ప్యాడ్‌ల వినియోగంలో సాంకేతిక సమస్య తలెత్తితే సరి చేసేందుకు టెక్నికల్ సిబ్బందిని నియమించాం. ముందస్తు చర్యగా అదనపు ఇవిఎంలు సిద్ధంగా ఉంచాం. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 12 ఫొటో గుర్తింపు కార్డుల ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. నియోజవర్గస్థాయిలో 31 వీడియోగ్రాఫ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఒక ఎస్ఐతో పాటు ఒక వీడియో గ్రాఫర్ కూడా అందుబాటులో ఉంటారు. 56 పోలింగ్ స్టేషన్లో మైక్రో అబ్జర్వ్ అందుబాటులో ఉంచాం. నియోజకవర్గంలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్స్, 2 సర్వైవల్, 11 వీడియో గ్రాఫ్ బృందాలు తనిఖీల్లో భాగంగా ఇప్పటివరకూ సుమారు తొమ్మిది లక్షల వరకూ నగదును సీజ్ చేశాయి. నియోజకవర్గంలో 1,80,017 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. 85 నుంచి 90 శాతం ఓటింగ్ పెంచేందుకు కృషి చేస్తున్నాం.

పంపిణీలపై నిరంతరం నిఘా..

ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మద్యం, సొమ్ము, పంపిణీని అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఫ్లయింగ్ స్వాడ్ బృందాలు తిరుగుతున్నాయి. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి అరెస్టు చేయిస్తాం. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా రాజకీయ పార్టీలు ఓటర్లు సహకరించాలి.

సరికొత్త మెనూ తో భోజనం..

పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి సరికొత్త మెనూతో విందు భోజనం ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ ముందురోజు కేంద్రానికి చేరినప్పటి నుంచి పోలింగ్ రోజున సాయంత్రం పోలింగ్ ముగిసే వరకూ ప్రత్యేక మెనూ ఏర్పాటు చేశాం. ఒక పోలింగ్ కేంద్రానికి 15 మంది సిబ్బంది చొప్పున మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేశాం.

ప్రతి గ్రామంలోనూ 144 సెక్షన్ అమలు..

కైకలూరు రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్



ప్రజాశక్తి - కైకలూరు

ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన ప్రజాశక్తికి పలు విషయాలు వెల్లడించారు. నియోజకవర్గంలో 235 పోలింగ్ బూతులు సిద్ధం చేశామన్నారు. రెండు లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారన్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో ఏడుగురు సిబ్బందిని నియమించామని, ఇవిఎంలు, సియు పరికరాలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్దా తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేశామని తెలిపారు. బారికేడ్లు నిర్మించామని, వైద్య సదుపాయం అందుబాటులో ఉంచామని తెలిపారు. పోలింగ్ కేంద్రంలోపల గాలీ, వెలుతురు వచ్చేలా ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. ఘర్షణలకు తావులేకుండా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఓటర్లు ఉదయం 7 నుంచి సాయంకాలం 5 గంటల వరకూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నియోజకవర్గంలో మద్యం, డబ్బు పంపిణీ జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, పోలీసులను నిఘా ఉంచామన్నారు. ఇప్పటికే ఐదున్నర లక్షలకు పైగా నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఫ్లయింగ్ స్కాడ్లతో పాటు, వీడియో టీంలు తిరుగుతున్నాయని చెప్పారు. ఏ పోలింగ్ బూత్ వద్ద అయినా ఇవిఎంల సమస్య తలెత్తితే ఆర్ఒకు ఫిర్యాదు చేయాలన్నారు. తక్షణం వాటిని సరిచేసి కొత్తవాటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. పోలింగ్ అనంతరం ఇవిఎంలను ఏలూరులోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తామని వివరించారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా పోలింగ్ బూత్‌కు 100 మీటర్ల దూరంలోనే వాహనాలు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రచారం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈనెల 13న జరిగే పోలింగ్ కోసం శనివారం సాయంత్రం 6 గంటలకు ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా ముగిసింది. ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపిలు మైకులతో ప్రచారం జోరుగా సాగింది. చెవులు, హోరెత్తాయి. శనివారం ఉదయం నుంచి మైక్‌ల హోరు బాగా తగ్గిందనే చెప్పాలి. దీంతో సాయంత్రం నిర్ణీత సమయానికి ముందే ఎన్నికల ప్రచారం నిలిచిపోయింది. ఇదిలా ఉండగా ఎన్నికల సందర్భంగా శనివారం సాయంత్రం ఏడు గంటలకు పట్టణంలోని బ్రాందీ షాపులు మూసివేశారు. గత రెండు రోజులుగా మందుబాబులు మద్యం షాపుల వద్ద భారీగా కొనుగోలు చేశారు. శనివారం సైతం భారీగా ఉన్న సరుకునే రెండు రోజులు నిల్వ ఉండేలా కొనుగోలు చేశారు. బీర్లు, బ్రాందీ షాపుల్లో దొరక లేదని బార్ అండ్ రెస్టారెంట్‌లో మాత్రం దొరుకుతున్నాయని పలువురు యువకులు ఆందోళన వ్యక్తం చేశారు.

'ఎన్‌డిఏదే కూటమిదే అధికారం'

ప్రజాశక్తి - నరసాపురం

ఎన్నికల్లో ఎన్‌డియే కూటమి అధికారంలోకి వస్తుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం పట్టణంలోని ఏడవ వార్డులో చివరి రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎన్‌డియే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. మెయిన్ రోడ్, మార్కెట్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంకు భాస్కర్ నాయుడు, నిమ్మకాయల బాబ్జి, తిరుమాని శశి, బర్రె మురళీ పాల్గొన్నారు.

తణుకులో కారుమూరి కోడలు ప్రచారం

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎన్నికల్లో మళ్లీ వైసిపిని గెలిపించాలని తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి కారుమూరి వెంకటనాగేశ్వరరావు కోడలు కీర్తి అన్నారు. పట్టణంలో ఆమె శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం అందాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ జగనే రావాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను, తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి కారుమూరి వెంకటేనాగేశ్వరరావును గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి..

రిటర్నింగ్ అధికారి శివ నారాయణ రెడ్డి



ప్రజాశక్తి - పాలకొల్లు


ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పాలకొల్లు నియోజకవర్గంలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాలకొల్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివ నారాయణ రెడ్డి చెప్పారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం 190 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని, మొత్తం లక్షా 95 వేల 057 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవలసి ఉందన్నారు. వీరిలో 95,742 మంది పురుషులు, 99,309 మంది మహిళలు, ఆరుగురు థర్డ్ జెండర్లు ఉన్నట్లు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సజావుగా జరిగేందుకు 1,140 మంది పిఒలు, ఎపిఒలు, ఒపిఒలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఆదివారం ఆయా పోలింగ్ కేంద్రాలకు సామాగ్రిని తీసుకుని వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొత్తం 21 రూట్లను ఏర్పాటు చేశామని, వీటికి తగిన విధంగా బస్సులను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు మధ్యాహ్నం నుంచి సిబ్బంది చేరుకుంటారని, సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని అన్నారు. ప్రజలు ఎండను లెక్కచేయకుండా ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే పోలింగ్‌లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలలో నిలిచి ఉన్న వారికి రాత్రి ఏ టైం అయినా ఓటింగ్ కల్పిస్తామని చెప్పారు.

పోలింగ్ పూర్తయ్యాక ఆయా రూట్‌లలో గట్టి పోలీస్ బందోబస్తుతో ఇవిఎం, ప్యాడ్‌లను విష్ణు ఇంజనీరింగ్ కళాశాలకు చేరుతుందని చెప్పారు. అక్కడ గట్టి పోలీసు బందోబస్తు మధ్య లాకరులలో ఉంచుతామన్నారు. జూన్ నాలుగో తేదీన దేశంలోని అన్ని కేంద్రాలతో పాటు భీమవరంలో కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు.

ఇండియా వేదికతోనే రాష్ట్రాభివృద్ధి : ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

ఇండియా వేదికతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా అన్నారు. మండలంలోని యర్రంపల్లి గ్రామంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటే ఇండియా వేదిక అధికారంలోకి రావాలన్నారు. ఇండియా వేదిక అధికారంలోకొస్తే రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న తొమ్మిది గ్యారంటీల గురించి ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబంలో మహిళకు నెలకు రూ.8033, ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.400 అందిస్తుందన్నారు. పేదలకు రూ.ఐదు లక్షలతో ఇంటి నిర్మాణం చేపడుతుందన్నారు. వృద్ధులకు రూ.నాలుగు వేల పెన్షన్, వికలాంగులకు రూ.ఆరు వేలు ఇస్తుందన్నారు. ఎన్నికల్లో ఇండియా వేదికను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ప్రచారంలో ఎలిజా

ప్రచారం ముగిసింది

చివరిరోజు పర్యటించిన వైసిపి, టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థులు
నగరంలో ఇండియా వేదిక అభ్యర్థుల పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సోమవారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రం ఆరు గంటలకు ప్రచారం ముగిసింది. అయితే ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పోటీదారులైన వైసిపి అభ్యర్థి ఆళ్ల కాళీ కృష్ణశ్రీనివాస్, టిడిపి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య చివరి రోజు అయిన శనివారం ఎలాంటి ప్రచారం నిర్వహించలేదు. వారి వారి పార్టీ కార్యాలయాల్లో ముఖ్య నేతలతో సమావేశాలు సమాలోచనలతో గడిపారు. టిడిపి, కాంగ్రెస్ నేతలు చివరి రోజు ప్రచారం నిలుపుదల చేసి ముఖ్య నేతలతో సమావేశాలు జరుపుతూ పోలింగ్ రోజు అనుసరించాల్సిన వ్యూహాలపై సమాలోచనలు చేస్తున్నారు. టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి శనివారం మూడు గంటల సమయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైసిపిని ఓడించి టిడిపి కూటమిని గెలిపించాలన్నారు. సిపిఐ ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు శనివారం నియోజకవర్గం మొత్తం పర్యటించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యతో కలిసి ఓటర్లను అభ్యర్థించారు. ఉదయం ఐదు గంటలకే అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఇండోర్ స్టేడియం వద్ద వాకర్స్‌ను కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. అనంతరం తొమ్మిది గంటల నుంచి ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యతో కలిసి నగరంలో భారీగా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జంగారెడ్డిగూడెం రోడ్డులోని ఎంఆర్‌సి కాలనీ నుంచి సిపిఐ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యను, సిపిఐ ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపించాలన్నారు. ఏలూరు నియోజకవర్గంలో విలీనమైన ఏడు గ్రామాల్లో ఉన్న వంద మురికి వాడల్లోని రోడ్లు, పారిశుధ్యం, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలకు కృషి చేస్తామని తెలిపారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ వ్యవస్థను ప్రక్షాళన, ఏలూరు జిల్లా కేంద్రంలో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పవర్‌పేట రైల్వే స్టేషన్ దగ్గర, ప్రధాన మార్కెట్లలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సాయంత్రం బండి వెంకటేశ్వరరావు కొత్తపేట చోడిదిబ్బ ప్రాంతాల్లో పర్యటించి ఓటర్లను అభ్యర్థించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రభాకర్, కృష్ణచైతన్య

బిజెపిపై జగన్ మౌనం

(మొదటి పేజీ నుంచి)

కడపలో ఉక్కు పరిశ్రమ, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ వంటివాటిపై మోడీ సర్కార్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసింది. బిజెపి అభ్యర్థి బరిలో ఉన్నచోట సభ జరిగినప్పుడు ఆ పార్టీ రాష్ట్రానికి చేసిన అన్యాయాల గురించి మాట్లాడాల్సి ఉంటుంది. కానీ జగన్ బిజెపిపై ఒక్క విమర్శ కూడా చేయలేదు. ప్రసంగం ఆఖర్లో మాత్రం ఫ్యాన్ ఇంట్లో ఉండాలని, సైకిల్ బయట ఉండాలని, గాజు గ్లాస్ సింక్‌లో ఉండాలంటూనే బిజెపి సైతం సింక్‌లో ఉండాలని, మళ్లీ చెరువులో ఉండాలని ముక్తాయించారు. చివరిలో బిజెపి చెరువులో ఉండాలన్న ఒక్కమాట తప్ప వేరొక మాట బిజెపి గురించి జగన్ మాట్లాడకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

కొల్లేరు సమస్యను పరిష్కరిస్తా

కొల్లేరు సమస్య పరిష్కారం కావాలంటే మీ బిడ్డ అధికారంలోకి రావాలని జగన్ అన్నారు. ఇప్పటికే కొల్లేరు సర్వే పూర్తయిందని, నివేదిక ఆధారంగా అదనపు భూములు పంచుతామన్నారు. 2019 ఎన్నికల్లో కొల్లేరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, కొల్లేరుకు పూర్వవైభవం తెస్తామని, సముద్రపు నీరు కొల్లేరులోకి ప్రవేశించకుండా రెగ్యులేటర్ల నిర్మాణం చేస్తామని వైసిపి హామీలిచ్చినా ఏఒక్కటీ నెరవేర్చని పరిస్థితి ఉంది. స్థానిక సమస్యలపైనా సిఎం ఒక్క మాట మాట్లాడలేదు. స్థానిక వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి దూలం నాగేశ్వరరావుకు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌కు ఓటువేయాలని జగన్ కోరారు.

ష్.. గప్‌చుప్..!

(మొదటి పేజీ నుంచి)

రూ.పది వేలు చొప్పున ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రతి నియోజకవర్గంలోనూ డబ్బు యథేచ్ఛగా పంచేస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని దాటవేత ధోరణి అవలంభిస్తున్నారు. డబ్బు పంపిణీ వ్యవహారం పోలీసులతోపాటు గ్రామ, మండలాల్లోని అధికారులందరికీ తెలుసు. అయినప్పటికీ కనీస చర్యలు చేపట్టడం లేదు. దీంతో యథేచ్ఛగా ఓట్ల కొనుగోలు సాగుతోంది.

రేపు ఎన్నికల పోలింగ్

2024 ఎన్నికల సమరం చివరి అంకానికి చేరింది. శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగియడంతో అధికారులంతా 13న జరిగే పోలింగ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆదివారం ఉదయం నుంచి నియోజకవర్గ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్‌ను అధికారులకు అప్పగించనున్నారు. అక్కడ నుంచి ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులంతా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. అందుకోసం ప్రత్యేక బస్సులు, వాహనాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. రెండు జిల్లాల్లో దాదాపు 30 లక్షల మందికిపైగా ఓటర్లు సోమవారం జరిగే పోలింగ్‌లో తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించనున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రెండు జిల్లాల్లో దాదాపు ఆరు వేల మంది వరకూ పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఓటర్లకు స్లిప్పుల పంపిణీ పూర్తయ్యింది. ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో నాయకులు తమ వ్యూహాలకు మరింత పదును పెడుతున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు సిద్ధం

(మొదటి పేజీ నుంచి)

సమకూర్చామన్నారు. అధికారులంతా ఎన్నికల కమిషన్ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలని, ఎన్నికల విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్ల నియామకానికి సంబంధించి పోటీ చేసే అభ్యర్థి నుంచి లిఖితపూర్వక లేఖను ఆయా పిఒలు తీసుకోవాల్సి ఉంటుందని, ఈ మేరకు ఆర్‌ఒలు జాగ్రత్త వహించాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో ఈ రెండు రోజులు చాలా కీలకమని, అందరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎన్నికల సిబ్బందికి అల్పాహారం, భోజన సదుపాయాలు ఎటువంటి లోపమూ లేకుండా, సమయానికి అందేలా చూడాలన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

(మొదటి పేజీ నుంచి)

గురి కావొద్దని కోరారు. ప్రతిఒక్కరూ పోలింగ్ కేంద్రానికి వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యవంతులు కావాలని విజ్ఞప్తి చేశారు. వివాదాలకు ఆస్కారం లేకుండా పోలింగ్ ప్రక్రియ స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులోకొచ్చిందని, 13వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు ఉంటుందని తెలిపారు. 12వ తేదీన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ యంత్రాలు, సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు పంపుతామని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఎఫ్‌ఎస్‌టి, ఎస్ఎస్‌టి టీమ్‌లు సమర్థంగా పని చేస్తున్నాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు నగదు రూ.1.29 కోట్లు, మద్యం రూ.41.8 లక్షలు, బంగారం, వెండి ఆభరణాలు రూ.1.98 కోట్లు, లోహ పరికరాలు, వస్తువులు రూ.1.7 లక్షలు విలువైనవి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో 1,463 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 14,72,923 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 7,21,532 మంది, స్త్రీలు 7,51,313 మంది, ఇతరులు 78 మంది ఉన్నారని, వీరిలో సర్వీస్ ఓటర్లు (సైనికోద్యోగులు) 888 మంది, 85 ఏళ్లకు పైబడిన వారు 7,803, యువ ఓటర్లు 38,188 మంది ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 1,463 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా, వాటిలో 282 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 140 మంది సెక్టార్ అధికారులను, 140 మంది సెక్టార్ పోలీస్ అధికారులను, 282 మంది మైక్రో అబ్జర్వర్లు నిరంతరాయంగా పోలింగ్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించడానికి నియమించినట్లు తెలిపారు. హింస జరిగే అవకాశం ఉండే పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహిస్తాయని తెలిపారు. 1,463 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ చేసేందుకు ఏర్పాటు చేశామని, పోలింగ్ సరళిని లైవ్ ద్వారా జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. జిపిఎస్ ఆధారిత ఈ వాహనాలు పోలింగ్ సామగ్రితో పాటు సిబ్బందిని ఆయా కేంద్రాల వద్ద దించడం, పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తీసుకురావడం చేస్తాయని, దీనికి 160 ఆర్‌టిసి బస్సులు, 260 మినీ బస్సులు, 21 ఇతర వాహనాలు, 12 బోట్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 1,659 మంది పిఒలు, 1,631 మంది ఎపిఒలు, 6,521 మంది ఒపిఒలను ఎన్నికల విధులకు నియమించినట్లు పేర్కొన్నారు. రిసెప్షన్ కేంద్రాలుగా ఎస్ఆర్‌కెఇంజినీరింగ్ కాలేజ్, విష్ణు ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న నాని

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - గణపవరం

వేసవిలో బాటసారులకు దాహార్తిని తీర్చడానికి తన వంతు కర్తవ్యంగా వరదరాజపురంలో ఉన్న కెవిపి ఫంక్షన్ హాల్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం కెవిపి ఫంక్షన్ హాల్ అధినేత గోలి నాని ప్రారంభించారు. మజ్జిగ చలివేంద్రాన్ని వేసవి వెళ్లే వరకు బాటసారులకు అందిస్తామని చెప్పారు. తమ సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బాటసారులకు దాహార్తిని తీర్చడానికి మజ్జిగ అందజేస్తారని అన్నారు. ఫంక్షన్ హాల్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల వాహనదారులు, బాటసారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డి పద్మారావు, కె.వెంకటరమణ, బండారు శ్రీనివాసు పాల్గొన్నారు.

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికలవేళ టిడిపిలోకి వలసలు కొనసాగుతున్నాయని టిడిపి జిల్లా అధ్యక్షులు, ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. శనివారం ఉండి మండలం చెరుకువాడ వైసిపి గ్రామ అధ్యక్షులు కొండవీటి సత్యనారాయణ, వైసిపి సీనియర్ నాయకులు దాసరి సనాతన, గుండాబత్తుల సతీష్ ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, టిడిపి ఉండి అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా దాసరి సనాతన మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టో నచ్చి టిడిపిలోకి చేరామని ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణంరాజు విజయానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. బిసిల అభివృద్ధికి, బిసి సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేయడంలో తాము చంద్రబాబు నాయుడుకు మద్దతు తెలిపేందుకు పార్టీలో చేరినట్లు కొండవీటి సత్యనారాయణ అన్నారు. పార్టీలో చేరిన వారికి కనుమూరి రఘురామకృష్ణంరాజు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

హోరాహోరీగా సాగిన ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం

నియోజకవర్గంలో హోరాహోరీగా జరిగిన ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. శనివారం పట్టణంలోని మెయిన్ రోడ్డులో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు, జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ పోటాపోటీగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందస్తుగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైసిపి అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు వైసిపి కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు, స్టీమర్ రోడ్డులో ఉన్న వ్యాపారుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. తొలిరోజు మండలంలోని గొంది గ్రామంలో ఎన్నికల ప్రచారం మొదలై, పట్టణంలో శనివారం పూర్తి అయ్యింది.

జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి పట్టణంలోని మెయిన్ రోడ్డు, స్టీమర్ రోడ్డు, మార్కెట్‌లో ప్రచారం నిర్వహించారు.

ఉపాధి కూలీలకు తాగునీరు సరఫరా చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా

ప్రజాశక్తి - పెనుగొండ

జాతీయ ఉపాధి హామీ చట్టం కింద పనిచేస్తున్న వ్యవసాయ కూలీలు పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటివి లేకుండా పనులు చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. శనివారం వడలి, పెనుగొండ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మిక సంఘం బృందం పర్యటించి ఉపాధి కూలీలను కలిసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాదుషా మాట్లాడుతూ పని ప్రదేశంలో తక్షణం తాగునీరు ఏర్పాటు చేసి, కార్మికులకు వడదెబ్బ తగలకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. రెండు పూటలా పనిచేయిస్తున్న అధికారులు నీడ కోసం టెంట్ గాని, గాయాలు తగిలినప్పుడు ఫస్ట్ ఎయిడ్ బాక్స్ గాని అందుబాటులో ఉంచకపోవడం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పాదుషా

దుర్మార్గమన్నారు. కార్మికులను పని ప్రదేశంలోనే ఉంచి ఫోటోలు తీసిన తర్వాత సంతకాలు అక్కడే సేకరించకుండా కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు తమ వద్దకే వచ్చి సంతకాలు చేయాలని అటూ ఇటూ తిప్పుతూ ఇబ్బంది పెడుతున్నారని పలువురు కార్మికులు వాపోయారు. వడలి గ్రామంలో మానే మంగమ్మ గ్రూపుకు చెందిన 30 మంది కార్మికులకు నెల రోజులుగా పని ఇవ్వకుండా ఫీల్డ్ అసిస్టెంట్ సునీత ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. పనిలేని సమయంలో పనులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పని పరిస్థితులను పర్యవేక్షించి కూలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు చెట్టుకూలి గాయపడ్డ విద్యార్థి

వెన్నుముకకు గాయం - రాజమండ్రిలో శస్త్ర చికిత్స - ఆలస్యంగా వెలుగులోకి..



పెనుమంట్ర:ఈనెల 7వ తేదీన కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు భారీవృక్షం విరిగి మీదపడి విద్యార్థి తలకు, వెన్నుపూసకు గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని వెలగలవారిపాలెంకు చెందిన సామాన్య రైతు కర్రి రామకృష్ణారెడ్డి కుమారుడు పవన్ రెడ్డి ఈనెల 7వ తేదీ మంగళవారం ఉదయం ప్రాక్టికల్స్ ఉన్నాయని కళాశాలకు ఎప్పటిలాగే సైకిల్ మీద వెళ్లాడు. మధ్యాహ్నం ఆకస్మాత్తుగా వాతావరణం మారి ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈలోపు ఇంటికి వెళ్లి భోజనం చేసి వద్దామని సైకిల్ మీద బయలుదేరిన కాసేపటికే మార్టేరు - పెనుగొండ రోడ్డులో విరిగి



చికిత్స అందుకుంటున్న పవన్‌రెడ్డి

పడ్డ భారీ వృక్షం పవన్ రెడ్డి మీద పడింది. ఈ ఘటనలో అతనికి తలకు, మెడ-వెన్నుపూసకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో ప్రాథమిక చికిత్స జరిపి, తణుకు సూర్యతేజ ఆస్పత్రికి, అక్కడ నుంచి రాజమండ్రి విజయ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం పవన్ రెడ్డి వెన్నుపూసకు శస్త్రచికిత్స జరిగిందని, కోలుకోవడానికి ఏడాది పడుతుందని ఆస్పత్రి వర్గాలు చెప్పినట్టు విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. అంత పెద్ద చెట్టు పడి గాయాలపాలైనా ప్రాణాలతో బయటపడ్డ పవన్‌రెడ్డి నిజంగా మృత్యుంజయుడే అంటూ వెలగలవారిపాలెం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన ప్రచార పర్వం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎన్నికల శంఖా రావం పూరించిన నాటి నుంచి భీమవరం నియోజకవర్గంలో వైసిపి, ఎన్‌డిఏ కూటమి పార్టీలతో పాటు కాంగ్రెస్ స్వతంత్ర అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి పెద్దఎత్తున చేసిన ప్రచార కార్యక్రమాలు శనివారంతో



ప్రచారంలో వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్

ముగిశాయి. భీమవరం నియోజకవర్గంలో వైసిపి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ ఒక ప్రణాళికా బద్ధంగా ప్రచారాన్ని పూర్తిచేసి శుక్రవారం వీరవాసరం మండలంలో ప్రచారం ముగించారు. జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) తనదైన శైలిలో ఈ ఎన్నికల్లో ప్రచారం చేశారు. నియోజకవర్గం మొత్తం తన అనుచరగణంతో ప్రచారం చేసి శనివారం సాయంత్రం భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామంలో ముగించారు. ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి అంకెం సీతారాం ప్రచారంలో తన ప్రత్యేకతను చాటు కున్నాడు. ఇండియా వేదికలో భాగమైన సిపిఎం, సిపిఐలను కలుపుకొని నిత్యం ప్రజల మధ్య ఉంటూ, పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వినిపించారు. కాంగ్రెస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయన శనివారం మండలంలోని చిన్న అమిరం గ్రామంలో ఎన్నికల ప్రచారానికి ముగింపు పలికారు. వీరితోపాటు బిసివై ఎంఎల్ఎ అభ్యర్థి వడ్డికాసులతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమ తమ ప్రచారాన్ని ముగింపు పలికారు.

ఒక్క అవకాశమివ్వండి..

కాంగ్రెస్ వేదిక అభ్యర్థి మార్నీడి బాబ్జి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించమని మారేడు శేఖర్(బాబ్జి) కోరారు. శనివారం స్థానిక 15వ వార్డు సవిత్ర పేటలో మార్నీడి శేఖర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆఖరు రోజు బాబ్జి సొంత వార్డులో పాదయాత్రగా వెళ్లి ఓటర్లను ఇండియా వేదిక కాంగ్రెస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలన్నా, రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ, పెన్షన్ రూ.4 వేలు, వికలాంగుల పెన్షన్ రూ.6 వేలు, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు, పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామన్నారు. రాష్ట్రంలో సిపిఎం, సిపిఐ బలపరిచిన



మాట్లాడుతున్న మార్నీడి బాబ్జి

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మండలంలో 66 బూత్‌లు సిద్ధం

59,132 మంది ఓటర్లు

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో 66 పోలింగ్ బూత్‌లు సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమయ్యాయి. వీటిలో 2,838 మంది పురుషులు, 30 వేల 293 మంది మహిళలు, ఒక నపుంసకులు కలిపి మొత్తం 59 వేల 132 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీటిలో 10 బూత్‌లను అధికారులు సమస్యాత్మక బూత్‌లుగా గుర్తించారు. ఆయా బూత్‌ల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాగా మండలంలో చినమిలిపాడు గ్రామంలో కమ్యూనిటీ హాల్లో ఒకటి, సిద్ధాపురం సువర్ణపతి గ్రంథాలయంలో ఒకటి, రాజుల పేట గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఒకటి, కోళ్లపర్రు గ్రామ పంచాయతీలో ఒకటి, దుంపగడప గ్రామపంచాయతీలో ఒకటి, ఆకివీడు మండల పరిషత్ కార్యాలయంలో రెండు బూత్‌లను ఏర్పాటు చేశారు. మిగిలిన బూత్‌లను ఆయా గ్రామాల్లోని పాఠశాలలో ఏర్పాటు చేశారు.

ఎగబడిన మందుబాబులు

ప్రజాశక్తి - ఆకివీడు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లిక్కర్ షాపులకు ఎన్నికల కమిషన్ 48 గంటలు విరామం ప్రకటించిన పరిస్థితులు మందుబాబులు తట్టుకోలేకపోతున్నారు. 48 గంటల ముందు దొరకదు అంటే అమ్మ బాబోయ్ ఇంక ఏమైనా ఉందా అంటున్నారు ఒక మద్యం ప్రియుడు. అందుకే అరగంట నుంచి యుద్ధం చేస్తున్నాం.. ఇక్కడ మందు కోసం అంటున్నాడు. లిక్కర్ అయిపోతే మళ్లీ దొరకదేమో అన్న కంగారు వీళ్లలో మరీ ఎక్కువైంది. శనివారం తెల్లవారుజాము నుంచి లిక్కర్ షాపుల వద్దకు చేరారు మందు ప్రియులు. షాపు తెరవడం పాపం పోలోమంటూ పడిపోయారందరూ. మధ్యాహ్నం వరకూ ఎవరి ఓపిక కొద్దీ వాళ్లు బాటిళ్లు మోసుకెళ్లిపోయారు. ఇక మధ్యాహ్నం నుంచి మందు కావాలంటే పరపతి కావాలి. మొహమాటం, స్నేహం ఉన్నవాళ్లకే ఇక్కడ మందు దొరుకుతుంది. లేకపోతే మధ్యాహ్నం నుంచి లేదు. ప్రతి షాపుల్లోనూ మధ్యాహ్నం నాటికే 75 శాతం లిక్కర్ ఖాళీ అయిపోయింది. రెండు రోజుల అమ్మకాలు ఒక్కరోజులో అమ్మేశారు. ముందుగానే ఎవరు జాగ్రత్తల్లో వాళ్లు ఉన్నారు. కొందరికి తక్కువైనా పర్వాలేదులే రాత్రికి వాళ్లు ఇస్తారుగా అంటున్నారు. డబ్బులు, మందు రెండూ వస్తాయి అని వారి ధైర్యం. ఇదండీ మందుబాబుల భరోసా.



రోడ్ షోలో పితాని తనయుడు భానుచందర్

ముగిసిన ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో తెరపడింది. ఆఖరి రోజు శనివారం టిడిపి కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ తనయుడు పితాని భానుచందర్ నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించి, సాయంత్రం ఐదు గంటలకు ఆచంటలో ముగించారు. వైసిపి అభ్యర్థి మాత్రం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సుమారు నెలరోజులుగా వివిధ రాజకీయ పార్టీలు గ్రామాల్లో, పట్టణాల్లో, ఆటోలు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాలు వంటి వాహనాలపై అభ్యర్థుల ఫ్లెక్సీలు, మైకులతో మోటార్ సైకిల్ ర్యాలీ, రోడ్ షోలు నిర్వహించారు. ఎండ వేడిమి తట్టుకోలేక సాయంకాలం సమయంలో టిడిపి కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ, వైసిపి అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కాంగ్రెస్ అభ్యర్థి నెక్కంటి వెంకట సత్యనారాయణ(సతీష్) రోడ్ షోలు, ఇంటింటి ప్రచారాలు హోరెత్తించారు. మొత్తానికి వైసిపి, టిడిపి అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో నిలిచి గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన

అలరించిన ముగ్గుల పోటీలు
ఆకట్టుకున్న దీపాలంకరణ

ప్రజాశక్తి – ఏలూరు సిటీ

ఏలూరు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్వీప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏలూరు సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్నికల ప్రాముఖ్యతపై ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ప్రజలకు ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహన కలిగించే విధంగా ముగ్గులు వేశారు. ఈ ముగ్గుల పోటీలను ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్, ఎస్.ఎ.రామన్, పోలీస్ పరిశీలకులు టి.శ్రీధర్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఆయా ముగ్గుల ద్వారా ఓటు ప్రాధాన్యతను తెలియజేసే పలు అంశాలను చదివి ఈ పోటీలో పాల్గొన్న మహిళలను వారు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సెల్ఫీస్టాండ్ వద్ద ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్ తాము ఓటుహక్కు వినియోగించుకున్నానని సెల్ఫీ దిగారు. అనంతరం



ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, తదితరులు

అందరిని ఆకట్టుకున్న ఆరు అడుగుల మోడల్ ఇవిఎం వద్ద ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్, ఎస్.ఎ.రామన్, పోలీస్ పరిశీలకులు టి.శ్రీధర్, కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఫొటో దిగారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణలో భాగంగా స్వీప్ కార్యక్రమాల కింద నిర్వహించిన ఫొటో గ్యాలరీని వారు తిలకించారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ

సెయింట్ థెరిస్సా కళాశాల సమావేశ మందిరంలో ఓటేద్దాం.. రండి. కదిలి రండి... పేరిట ఏర్పాటు చేసిన దీపాలంకరణ అందరిని విశేషంగా ఆకట్టుకుంది. మధ్యలో ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో అర్హులైన ఓటర్లంతా తమ ఓటు వినియోగించుకోవాలని జిల్లా యంత్రాంగం కోరుతూ ముగ్గులతో ఏర్పాటు చేసిన అతిపెద్ద ఆహ్వాన పత్రిక చూపరులను ఆకర్షించింది. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మనదేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతామనిచ నిర్భయంగా ఓటు వేస్తామని ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్, ఎస్.ఎ.రామన్, పోలీస్ పరిశీలకులు టి.శ్రీధర్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి ఎన్.సూర్యచంద్రరావు, స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాస విశ్వనాధ్, కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సీ, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, ఉద్యానశాఖ డిడి రామ్మోహన్, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎన్ఎస్.కృపావరం, మెప్మా పీడీ ఇమ్మానియేల్, డిసిపిఒ సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

మహిళలు, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
దెందులూరు రిటర్నింగ్ అధికారి, జెసి లావణ్యవేణి



ప్రజాశక్తి – ఏలూరు టౌన్, దెందులూరు

దెందులూరు నియోజకవర్గంలో ఈ నెల 13వ తేదీన పోలింగ్‌కి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని దెందులూరు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి చెప్పారు. ఎన్నికల్లో ప్రతి ఓటరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆమె కోరారు. మహిళలు, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో మాట్లాడారు.

ప్రశ్న : ఎన్నికల్లో నియోజకవర్గానికి సంబంధించి ఎంత మంది పోటీ చేస్తున్నారు?

ఆర్ఒ : నియోజకవర్గంలో మొత్తం 15 మంది పోటీ చేస్తుండగా, ఒక నోటా ఓటు ఉంటుంది. రెండు జాతీయ గుర్తింపు పొందిన పార్టీలు, రెండు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందినవి. రెండు రిజిస్టర్ పార్టీలు, తొమ్మిది మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు.

ప్రశ్న : 13వ తేదీ పోలింగుకు నియోజకవర్గంలో ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

ఆర్ఒ : పోలింగ్‌కి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము. నియోజకవర్గంలో 239 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పిఒ, మూడు ఎపిఒలు, వెయ్యి మంది ఉన్న కేంద్రాల్లో నలుగురు ఒపిఒల చొప్పున 239 కేంద్రాలకు ఇలా నియమించినట్లు చెప్పారు.

ప్రశ్న : పోలింగ్ అధికారులకు ఎలాంటి సూచనలు చేశారు?

ఆర్ఒ : ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ 2024 ప్రకారం ఎన్నికల సిబ్బందికి శిక్షణలు ఇచ్చి నిబంధనలు వివరించాం. ఎన్నికలకు నియమించిన సెక్టార్ అధికారులు, పోల్‌డే మేనేజ్‌మెంట్ యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. ప్రిసైడింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు, పోల్‌డే మేనేజ్‌మెంట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పోలింగ్ ముందురోజు ఎన్నికల సిబ్బంది ఎన్నికల మెటీరియల్ తీసుకుని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బయలుదేరి పోలింగ్ కేంద్రాలకు చేరుకునే వరకు అన్ని విషయాలను పోల్ డే మేనేజ్‌మెంట్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. పోలింగ్ రోజైన ఈ నెల 13వ తేదీ ఉదయం ఆరు గంటలకు మాక్ పోల్ జరిపి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. తరువాత ఎన్నికల పోలింగ్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభించి ప్రతి రెండు గంటలకు ఎన్ని ఓట్లు పోలయ్యాయో వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పోలింగ్ ముగిసిన తర్వాత పోలింగ్ శాతాన్ని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. యాప్‌ను బిఎల్ఒలు, సెక్టార్ అధికారులు డౌన్‌లోడ్ చేసుకొని సదరు యాప్‌లో బిఎల్ఒలు పోలింగ్ కేంద్రాల జియో కోర్డినేటిస్‌ను అప్‌లోడ్ చేయాలి. పోలింగ్ రోజు ఇవిఎంలలో ఏ విధమైన సాంకేతిక సమస్యలు వచ్చినా యాప్‌లో అప్‌లోడ్ చేస్తే వెంటనే బెల్ కంపెనీ ఇంజినీర్లు పరిష్కరిస్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రత సమస్య వస్తే యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దీనిపై సంబంధిత సిబ్బంది వచ్చి పరిష్కరిస్తారు.

ప్రశ్న : అభ్యర్థులతో సమావేశాలు నిర్వహించారా?

ఆర్ఒ : దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం దెందులూరులో 2024 సాధారణ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సమావేశం నిర్వహించి పోలింగ్ రోజునకు 72 గంటల ముందు పాటించాల్సిన నియమాల గురించి తెలియజేశాం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం పోలింగ్ సమయానికి ముందు శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి సైలెంట్ పిరియడ్‌గా పరిగణించి ఎన్నికల ప్రచారం నిలిపివేసేలా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న : పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి నిబంధనలు వర్తిస్తాయి?

ఆర్ఒ : పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో మొబైల్ ఫోన్ వాడకూడదు. 200 మీటర్ల పరిధిలో ఓటర్లను ప్రభావితం చేయడం, ప్రచార గుర్తులు ప్రదర్శన చేయడం నిబంధనలకు విరుద్ధం. సదరు నిబంధనలను ఉల్లంఘించినవారిపై ఎన్నికల నియమావళి మేరకు తగు చర్యలు తీసుకుంటాం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి రిటర్నింగ్ అధికారి వారి ముందస్తు అనుమతి పొంది గరిష్టంగా మూడు వాహనాలు మాత్రమే వినియోగించుకోవాలి. సదరు వాహనాలను ఎన్నికల ప్రచారం కోసం వినియోగించడం నిబంధనలకు విరుద్ధం. అభ్యర్థులు తమ సొంత వాహనాల్లో గాని, ఇతర అద్దె వాహనాల్లో గాని ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించకూడదు. ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించడం కోసం 11వ తేదీ శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి 14వ తేదీ మంగళవారం సాయంత్రం ఆరు గంటల వరకు బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించడం, ప్రజలు గుంపులు గుంపులుగా, ఐదుగురు కంటే ఎక్కువ సంచరించకుండా ఇప్పటికే 144 సిఆర్‌పిసి సెక్షన్ అనుసరించి ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అభ్యర్థులందరు సహకరించాలి.

ప్రశ్న : ఎన్నికల వేల ఓటర్లకు మీరు ఇచ్చే సందేశం ఏంటి?


ఆర్ఒ : అందరు ఓటు హక్కు వినియోగించుకోవాలి. పోలింగ్‌ను ప్రశాంత వాతారణంలో జరిగేలా ప్రతిఒక్కరు సహకరించాలి.

ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలి

నరసాపురం పార్లమెంట్ వ్యయ పరిశీలకులు పీయూష్ శుక్లా

ప్రజాశక్తి – భీమవరం

అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని నరసాపురం పార్లమెంట్ వ్యయ పరిశీలకులు పియూష్ శుక్లా అన్నారు. కలెక్టరేట్‌లో నరసాపురం పార్లమెంట్ నియోజవర్గంలో పోటీలో ఉన్న 21 మంది అభ్యర్థుల ప్రచారాలకు సంబంధించి వ్యయాల రిజిస్టర్లను పియూష్ శుక్లా శనివారం క్షుణంగా పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారంలో చేసే ఖర్చులను షాడో బృందాలు, ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రచారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార ఖర్చులో వాటిని లెక్కించడం జరుగుతుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పార్టీల అభ్యర్థులు నడుచుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ఖర్చును మాత్రమే చేయాలని, నిబంధనలను అతిక్రమించి ఎక్కువ ఖర్చును చేస్తే అనర్హత వేటు పడుతుందని పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి గమనించాలన్నారు. ఈ



వ్యయ రిజిస్టర్లను పరిశీలిస్తున్న పియూష్ శుక్ల

కార్యక్రమంలో వ్యయ పరిశీలకుల సహాయకులు, పోటీలో ఉన్న అభ్యర్థులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు

ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్

ప్రజాశక్తి – ఏలూరు

ప్రజాస్వామ్య పండుగలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్ చెప్పారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఓటరు సెల్ఫీ పాయింట్‌లో ఆయన సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని తెలిపారు.



సెల్ఫీ తీసుకున్న కృష్ణకాంత్‌పాఠక్

నేడు ఎన్నికల సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి – నరసాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సామగ్రి పంపిణీ కార్యక్రమం ఆదివారం వైఎన్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. నరసాపురం రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ ఏర్పాట్లను పరిశీలించారు. గ్రౌండ్‌లో టెంట్లు, 16 రూట్లలో వెళ్లేందుకు బస్సులను సిద్ధం చేశారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ గాంధీ పోలింగ్ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాట్లను సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచన చేశారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని నరసాపురం రిటర్నింగ్ అధికారికి సూచించారు.

హింసాత్మక ఘటనలను ఉపేక్షించం

ఆచంట రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు

ప్రజాశక్తి – ఆచంట

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13వ తేదీ సోమవారం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో 24 గంటలు అత్యంత కీలక సమయమని, ఎన్నికలు సజావుగా సాగేందుకు అభ్యర్థులు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 114 సెక్షన్ అమలులో ఉందని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియామవాలి ఉల్లంఘించిన సందర్భాల్లో ఎటువంటి నోటీసులు ఇవ్వడం జరగదని, బైండోవర్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎన్నికల ఫలితలకు సంబంధించి ముందస్తుగా రాజకీయ పార్టీల ఎగ్జిట్ పోల్ నిర్వహించరాదన్నారు. పోలింగ్ కేంద్రాల లోపల బయట వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

ముగిసిన ప్రచారం..
మొదలైన ప్రలోభాల పర్వం

ప్రజాశక్తి – నరసాపురం

ఎన్నికల ప్రచారం ముగియడంతో పార్టీల అభ్యర్థులు ప్రలోభాలకు తెర లేపారు. ఓటర్లను ప్రసన్నం చేసుకుంనేందుకు డబ్బు, మద్యాన్ని ఎర వేస్తున్నారు. గ్రామాలు, వార్డులు, బూత్‌ల వారీగా ఏజెంట్లను నియమించి ఓటర్ల బాధ్యతను వాళ్లకు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మద్యం షాపులు మూసివేయగా ప్రధాన పార్టీ అభ్యర్థులు ఇప్పటికే సమకూర్చారని సమాచారం. పోలింగ్‌కు సమయం దగ్గర పడటంతో చివరి నిమిషం వరకూ ఓట్ల గాలింపు కోసం అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. మీకు ఎంత ఇచ్చారు? మీ ఊర్లో ఎవరు ఎంత ఇచ్చారు? అనే ప్రశ్నలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు ఇప్పటికే సొంత గ్రామాలకు చేరుకున్నారు. బయట ప్రాంతాల నుంచి ఓట్లు, వరుస సెలవుల నేపథ్యంలో అందరూ వచ్చేశారు.